
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 2 ఆగస్టు 2025



7న బీఆర్‌ఏయూలో జిల్లా ఆవిర్భావ దినోత్సవ పోటీలు

ఎచ్చెర్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పడి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంబేడ్కర్ యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఈనెల 7న వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, స్వాతంత్ర్యోద్యమంలో జిల్లా వాసుల పాత్ర, జిల్లా ప్రగతి ఘట్టాలు, వివిధ రంగాల ప్రముఖులు తదితర అంశాలపై సమధానాలు రాయాల్సి ఉంటుందన్నారు. వర్సిటీ, అనుబంధ కళాశాలల డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

కప్పేయ్.. దోచెయ్

ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని కొంతమంది నాయకులు అభాసుపాలు చేస్తున్నారు. వారి కనుసన్నల్లోనే దళారులు ఇసుక క్వారీల్లోకి ప్రవేశించి దోపిడీకి తెగబడుతున్నారు. కొంతమంది అధికారులు కూడా సహకరిస్తూ అడ్డగోలు అనుమతులు ఇవ్వడంతో.. వంశధార నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. కాలువను సైతం కప్పేసి.. లారీల్లో ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించి కోట్లాది రూపాయలు అర్జిస్తున్నారు.

- కాలువ మీద మట్టివేసి ఇసుక దోపిడీ
- వంశధార నదిలో అక్రమంగా తవ్వకాలు
- అధికార అండతో ఇష్టారాజ్యంగా..
- గొట్టా బ్యారేజీకి 3 కి.మీ. దూరంలో..
- ముప్పు పొంచిఉందని ఆందోళనలు
- క్వారీకి అడ్డగోలుగా అనుమతులు
- తమకు సంబంధం లేదంటున్న మైనింగ్
- ఇరిగేషన్‌శాఖ అధికారులదేనని స్పష్టం


మహాలక్ష్మీపురం సమీపంలో వంశధార నదిలో యంత్రంతో ఇసుక తవ్వకాలు


కాలువను కప్పేసి ఏర్పాటు చేసిన రహదారి

హిరమండలం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):

వంశధార నదీ పరివాహక ప్రాంతమైన పాతపట్నం నియోజకవర్గం.. ఇసుక క్వారీలకు నిలయంగా మారింది. ఇక్కడ నాణ్యమైన ఇసుక లభిస్తుండడంతో అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. జిల్లాతోపాటు ఇతర జిల్లాల వాసులు కూడా ఇక్కడ నుంచి ఇసుకను తరలించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి నేతల కన్ను ఇక్కడ ఇసుక దందాపై పడుతోంది. రాజకీయ, అధికార బలం ఉంటే చాలు.. క్వారీలకు నామమాత్రపు అనుమతి తీసుకువస్తున్నారు. ఆపై ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి.. యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. లారీల ద్వారా ఇసుక తరలించేందుకు హిరమండలంలోని వంశధార ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువను కూడా కప్పేశారు. కాలువలో నీటి ప్రవాహానికి చిన్నపైపును అమర్చారు. పైన గ్రావెల్ వేసి లారీలు వెళ్లేందుకు అనువుగా కాలువతోపాటు పొలాల్లో సైతం గ్రావెల్‌తో రహదారిని ఏర్పాటు చేశారు. కాలువ కప్పేయడంతో నీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నదుల్లో జూన్ 1 నుంచి అక్టోబరు 15వరకు ఇసుక తవ్వకాలపై నిషేధం విధించారు. నిల్వ కేంద్రాల్లోనే కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కానీ నిబంధనలకు విరుద్ధంగా వంశధార నదిలో ఇసుక తవ్వకాలు చేపడుతుండడం చర్చనీయాంశంగా మారింది.

● హిరమండలం మండలం మహాలక్ష్మీపురం గ్రామం సమీపంలోని వంశధార నదీ గర్భంలో ఇటీవల ఇసుక క్వారీకి మైనింగ్, ఇరిగేషన్ అధికారులు విశాఖపట్నానికి చెందిన ఇయాన్ గ్రూప్‌నకు అనుమతిచ్చారు. ఈ క్వారీని కొద్దిరోజుల కిందటే ప్రారంభించారు. ఈ క్వారీకిఇచ్చిన అనుమతులపై స్థానికుల నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతి పత్రంలో ఉచిత ఇసుక విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం భగీరథపురం గ్రామం వద్ద స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అలాగే డీసిల్టేషన్ (ఇసుక మేటలు)పాయింట్ ఏర్పాటుకు అనుమతులిచ్చినా.. ఇసుక తవ్వకాలు ఎక్కడ చేపట్టాలన్నది స్పష్టంగా పేర్కొనలేదు. వంశధార నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతిస్తున్నట్టు కూడా ఆర్డర్ కాపీలో ప్రస్తావించలేదు. ఈ ఇసుక క్వారీ నిర్వహణపై ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్ వద్ద ప్రస్తావించగా.. 'ప్రభుత్వ నిబంధనల ప్రకారం (మిగతా 4వ పేజీలో..)

సంస్కృతి, చరిత్రను ప్రతిబింబించేలా..

- 13 నుంచి ప్రతిష్ఠాత్మకంగా జిల్లా 75 వసంతాల వేడుకలు
- జిల్లా రెవెన్యూ అధికారి వేంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన ఈ నెల 13 నుంచి 15వరకు వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ 'జిల్లా సంస్కృతి, చరిత్ర పురోగతిని ప్రతిబింబించేలా ప్రతీ కార్యక్రమాన్ని రూపొందించాలి. ప్రజలంతా పాల్గొనేలా ఉత్సవాలు నిర్వహించాల'ని తెలిపారు. కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశారు.

● ఈ నెల 13న ఉదయం 10 గంటలకు మునిసిపల్ హైస్కూల్ మైదానంలో వేడుకలు ప్రారంభమవుతాయి. 1950 నుంచి 2025 వరకు జిల్లాలో చోటుచేసుకున్న అభివృద్ధిని ఆవిష్కరించేలా సాంస్కృతిక ప్రదర్శనలు, నాయకుల ప్రసంగాలు చేపట్టాలి. సాయంత్రం 4 నుంచి 7.30 వరకు ఆర్ట్స్ కళాశాల రోడ్డు నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు శోభాయాత్ర. ఆదివాసీ తెగల జానపద నృత్యాలు, సంగీతం, వారసత్వ కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. రాత్రి 6 నుంచి 10 వరకు ఫుడ్ స్టాల్స్ స్థానిక రుచులు, తెగల మిల్లెట్ ఫుడ్, తీరప్రాంత వంటకాలు లభిస్తాయి.

● 14న ఉదయం 8 గంటల నుంచి సంప్రదాయ క్రీడల పోటీలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు. మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు థింసా వంటి జానపద నృత్యాలు, స్వాతంత్ర్య పోరాట ఇతివృత్తాల నాటకాలు. సాయంత్రం 6 గంటలకు ప్రముఖుల సత్కారం. రాత్రి 10 గంటల వరకు ప్రత్యక్ష వంటల ఫెస్టివల్, సాంస్కృతిక సంగీతం.

● 15న ఉదయం 9 నుంచి 12-30 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు. జెండా ఆవిష్కరణ. దేశభక్తి గీతాలు. ముఖ్యమంత్రి ప్రతినిధి ప్రసంగం. డైమండ్ జూబ్లీ సందర్భంగా ప్రత్యేక పతాకావిష్కరణ ఉంటుందని డీఆర్వో తెలిపారు. నగరాన్ని అంగరంగ వైభవంగా ముస్తాబు చేస్తామన్నారు. అరసవల్లి సూర్యదేవాలయం, రైల్వే స్టేషన్, జాతీయ రహదారి కూడళ్లను ఎల్ఈడీ లైట్లతో అలంకరిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న డీఆర్వో వేంకటేశ్వరరావు

పింఛను... సంతోషం తెచ్చెను

- స్పౌజ్ కోటా వర్తింపుపై మహిళల్లో ఆనందం
- ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన వితంతు పింఛన్లను శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారుల్లో ఆనందరం వెల్లివిరిసింది. శ్రీకాకుళం మండలం పాత్రునివలసలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పింఛన్లు పంపిణీ చేశారు. కోటబొమ్మాళి మండలం తులసిపేటలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వితంతువులకు నూతన పింఛన్లు అందజేశారు. 'ఇంటి పెద్ద దిక్కును కోల్పోయాం. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. నాలుగేళ్లుగా పింఛన్ మంజూరు చేయాలని ఎందరినో వేడుకున్నాం. కానీ ఫలితం లేకపోయింది. ఇన్నాళ్లటికి మాకు వితంతు పింఛన్ మంజూరు కావడం ఎంతో ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని బమ్మిడి లచ్చమ్మ, మెండ శాంతమ్మ, ఎండ మల్లమ్మ తదితర లబ్ధిదారులు తెలిపారు.

మరిన్ని వివరాలు.. 4లో


బమ్మిడి లచ్చమ్మకు వితంతు పింఛన్ అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


ఆనందం వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు

వైసీపీ దొంగలను నిలదీయండి

- మంత్రి అచ్చెన్నాయుడు
- నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ

కోటబొమ్మాళి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయకుండా.. ఇప్పుడు 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ' పేరుతో వైసీపీ దొంగలు అసత్య ప్రచారాలు చేస్తూ గ్రామాల్లో తిరుగుతున్నారు. అలాంటి వారిని ప్రజలు నిలదీయాల'ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం చిట్టివలస పంచాయతీ తులసిపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. సమస్యలు తెలుసుకున్నారు. నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 3.50లక్షల పింఛన్లు తొలగించారు. ఇందులో వితంతు పింఛన్లు 1.20 లక్షలు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 1.09లక్షల మంది వితంతువులకు శుక్రవారం పింఛన్లు అందజేసింది. మిగిలిన వారికి త్వరలో అందజేస్తాం. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా హామీలను నెరవేరుస్తున్నాం. పింఛన్ (మిగతా 4వ పేజీలో..)


మాట్లాడుతున్న మంత్రి కె.శ్రీనివాస్. పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే శంకర్

పింఛన్ల విధానంలో ఆదర్శం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ల విధానంలో మన రాష్ట్రం.. దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతీ కుటుంబం సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. శుక్రవారం శ్రీకాకుళం మండలం పాత్రునివలసలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. నూతన వితంతు పింఛన్లను కూడా లబ్ధిదారులకు అందజేశారు. మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి శ్రీనివాస్ ఆదేశించారు. 'ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీనెలా 1న పింఛన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చాం. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేసి.. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యం. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో ప్రజలు భాగస్వామ్యం కావాలి' అని మంత్రి శ్రీనివాస్ (మిగతా 4వ పేజీలో..)

కష్టపడి.. కొలువు పట్టి!
- కానిస్టేబుళ్లుగా ఎంపికైన కుర్రాళ్లు
- అధిక శాతం మధ్యతరగతి కుటుంబాలే
4లో

గోవాలో జిల్లా మత్స్యకారుడి మృతి 6లో
- చేపలవేట చేస్తుండగా పడవ బోల్తా..

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు 6లో
- ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- రేట్లు, స్టాక్ వివరాలు నోటీసు బోర్డుపై పెట్టాలని స్పష్టం

పురుగుమందు డబ్బాతో మహిళ హల్‌చల్
- భర్త పట్టించుకోవడం లేదని ఆవేదన
- న్యాయం చేయాలంటూ పోలీసుస్టేషన్ ముందు ఆందోళన
6లో

పర్యాటకం దిశగా.. పూడిలంక తీరం

- అభివృద్ధి చేస్తే చిలుక సరస్సుగా మారే అవకాశం
- పెరగనున్న ఉపాధి మార్గాలు
- కలెక్టర్ ప్రకటనపై స్థానికుల్లో సంతోషం


పూడిలంక గ్రామం

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఆ ఊరి ప్రజలు గజగజ వణికిపోతారు. రోజుల తరబడి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయి.. చుట్టూ ఉప్పుటేరు మధ్య బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీసేవారు. కానీ ఇటీవల ఆ గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ ప్రకటించడంతో.. ఆ ప్రాంతవాసుల్లో భయం స్థానంలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిలంక తీరం చుట్టూ సువిశాలమైన ఉప్పుటేరు. మధ్యలో చిన్నకొండపైన కుగ్రామం. ఉప్పుటేరుపై పడవతో షికారు చేస్తే ఆ అనుభూతి చెప్పలేం. కాగా.. ఇప్పటివరకు పూడిలంక గ్రామం పేరు చెబితే.. తుఫాన్ల సమయంలో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులు, అధికారుల హడావిడి కనిపించేవి. కానీ పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన ఎవరూ చేయలేదు. ఇటీవల పూడిలంకలో వంతెన నిర్మాణం భూమిపూజ కోసం మంత్రి అచ్చెన్నతో వచ్చిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. ఇక్కడ వాతావరణాన్ని చూసి ముగ్ధులయ్యారు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వనరులు అధికంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పర్యాటకాభివృద్ధి దిశగా ఆలోచన చేస్తానని పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రకృతి అందాలు మెండుగా ఉన్న పూడిలంకను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఒడిశాలో చిలుక సరస్సుగా ధీటుగా ఉంటుంది. రోడ్డుకు ఇటువైపు పచ్చని చెట్లు, అటు సువిశాలమై ఉప్పుటేరు కేరళను తలపిస్తుంది. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే (మిగతా 4వ పేజీలో..)


పూడిలంకలో ఉప్పుటేరుపై స్థానికుల పడవ ప్రయాణం (ఫైల్)


చిదపానిపేట వద్ద కూలిపోయిన కల్వర్టు

కూలిన కల్వర్టు

- బోరుభద్ర, నౌపడ ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు

సంతబొమ్మాళి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం బోరుభద్ర-పాతమేఘవరం ఆర్‌అండ్‌బీ రహదారిలో చిదపానిపేట వద్ద కల్వర్టు శుక్రవారం ఉదయం కూలిపోయింది. దీంతో ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. సంధిపేట, రాజపురం, మూలపేట ప్రాంతాలకు వెళ్లే వంశధార కాలువపై కొన్నేళ్ల కిందట ఈ కల్వర్టు నిర్మించారు. ఈ రహదారిలో వందల టన్నుల బరువుండే పోర్టు వాహనాలు, రొయ్యల లారీలు రాకపోకలు సాగించడంతోనే కల్వర్టు కూలిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు కూలిపోవడంతో బోరుభద్ర, నౌపడ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాతమేఘవరం, సంది పేట, రాజపురం, లింగూడు గ్రామాల ప్రజలు బోరుభద్ర రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. మేఘవరం, మరువాడ, లక్కివలస, కొల్లిపాడు పంచాయతీల ప్రజలు నౌపడకు వెళ్లే మార్గం లేదని వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే అవకాశం లేక విద్యార్థులు, మత్స్యకారులు, ఈ ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పింఛను.. సంతోషం తెచ్చెను

- స్పౌజ్ కోటా వర్తింపుపై మహిళల్లో ఆనందం
- ప్రభుత్వానికి.. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులు వారు. భర్తలు దూరమై.. బతుకు భారమై కష్టంగా కాలం వెళ్లదీస్తున్న జీవులు. ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం వారి మోముల్లో ఆనందాన్ని నింపింది. రేపటిపై ఆశలు రేకెత్తించింది. చనిపోయిన భర్తల స్థానంలో భార్యలకు పింఛను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం... దానిని అమలు చేయడంతో ఆ మహిళల కళ్లలో చెప్పలేని సంతోషం కనిపిస్తోంది. శుక్రవారం అత్యధిక శాతం మహిళలు పింఛన్లు అందుకున్నారు. కుటుంబ అవసరాలకు ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని కొందరు.. అనారోగ్యంతో బాధ పడుతున్న తమకు మందుల కొనుగోలుకు ఈ డబ్బులు ఉపయోగపడతాయని కొందరు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్ల తరువాత పింఛను..


ఆనందం వ్యక్తం చేస్తున్న చంద్రావతి

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన సూరాడ చంద్రావతి వయస్సు 80 ఏళ్లు. ఆమె భర్త సూరాడ విశ్వనాథం మరణించి నాలుగేళ్లయింది. పింఛను కోసం సచివాలయం చుట్టూ ఆమె తిరిగినా అప్పటి వైసీపీ ప్రభుత్వం కనికరించలేదు. దీంతో సార్వత్రిక ఎన్నికల సమయంలో వజ్రపుకొత్తూరులో ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి గౌతు శిరీషను కలసి తనగోడు వినిపించింది. దీంతో ఆమె సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం భర్త పింఛను భార్యకు కేటాయించడంతో చంద్రావతికి అవకాశం దొరికింది. కూటమి నాయకులు అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణలు అధికారుల సమక్షంలో శుక్రవారం ఆమెకు పింఛను అందించారు. ఆర్థిక ఇబ్బందులలో ఉన్న తనకు పింఛను మంజూరు చేయడం వల్ల కొత్త ఊపిరి ఇచ్చినట్లయిందని చంద్రావతి అన్నారు. భర్త చనిపోయిన నాటి నుంచి పింఛను కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు.

ఆర్థిక భరోసా దొరికింది..



ఎల్.ఎన్.పేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్తకు గతంలో పింఛను వచ్చేది. ఆయన చనిపోయి సుమారు సంవత్సరం దాటిపోయింది. అప్పటి నుంచి నా కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందక ఇబ్బందులు పడవలసి వచ్చింది. ఎన్టీఆర్ భరోసా పింఛనుతో ఎంతో ధైర్యం వచ్చింది.

-మామిడి సీతారాం, బొర్రంపేట

వైసీపీ హయాంలో పట్టించుకోలేదు



నా భర్త రామమూర్తి మరణించి నాలుగేళ్లవుతోంది. పింఛను కోసం సచివాలయం, వైసీపీ నాయకుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నా ఆవేదన చెప్పాను. వితంతు పింఛను మంజూరు చేయడం సంతోషాన్ని కలిగిలించింది. ఈ ప్రభుత్వానికి ఎప్పుడూ నా దీవెనలు ఉంటాయి.

-గున్న సరోజినమ్మ, పలాస

చంద్రబాబుకు రుణపడి ఉంటా..



పలాస, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్త అనారోగ్యంతో 18 నెలల క్రితం మృతి చెందారు. కూటమి ప్రభుత్వంలో మొదటిసారిగా పింఛను రూ.4వేలు అందింది. నా నిరీక్షణ ఫలించింది. చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

-తిరునగరి సరస్వతి, పలాస

కుటుంబ పోషణకు బలాన్ని ఇచ్చింది..


సచివాలయ ఉద్యోగి నుంచి పింఛను అందుకుంటున్న బోడెమ్మ

టెక్కలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్త ఉర్లాపు గురునాథ్ అనారోగ్యంతో చనిపోయిన తరువాత కుటుంబ పోషణ భారమైంది. ఇంటిల్లిపాదీ గడవాలంటే నా భర్తకు వచ్చే పింఛనే ఆసరాగా ఉండేది. ఎన్నాళ్లగానో పింఛను కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఈ పింఛను నాకు ఎంతో బలాన్ని ఇచ్చినట్లయ్యింది.

పింఛనే జీవనాధారం..


సచివాలయ ఉద్యోగి నుంచి పింఛను అందుకుంటున్న పార్వతి

నా భర్త వైశ్య రాజు చనిపోయిన తరువాత కుటుంబమంతా దినదిన గండంగా బతకాల్సి వచ్చింది. నెలనెలా భర్తకు వచ్చే పింఛను ఆగిపోయింది. అదే మా కుటుంబానికి జీవనాధారంగా ఉండేది. నాకు, పిల్లలకు ఇప్పుడు వచ్చిన పింఛను కొండంత అండగా నిలిచినట్లయింది.

ఎంతో ఆసరాగా ఉంది...


పింఛను తీసుకుంటున్న రాములమ్మ

గార, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్త చనిపోయి కొన్ని నెలలు కావస్తోంది. ఏ ఆధారం లేని నాకు ప్రభుత్వం అందిస్తున్న పింఛను ఎంతో ఆసరాగా నిలుస్తుంది. తొలిసారిగా ఈ పింఛను అందుకోవడం ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది.

కుటుంబానికి భారం కాను..


గ్రామ కార్యదర్శి నుంచి పింఛను అందుకుంటున్న కోరాడ ధనలక్ష్మి

పాతపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్త రెండేళ్ల క్రితం మృతి చెందడంతో ఆయనకు వచ్చే వృద్ధాప్య పింఛను నిలిచిపోయింది. దీంతో కుమార్తె వద్ద ఉంటున్నాను. నాటి పాలకులు, అధికారులు నాకు పింఛను మంజూరు చేస్తామని రెండేళ్లుగా చెబుతూ వచ్చారు గానీ ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం పింఛను మంజూరు చేయడం ఆనందంగా ఉంది. నేను కుటుంబీకులకు భారమైపోనని అనిపించింది.

మా కష్టాలు గట్టెక్కాయి..



హరిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మా ఇంటిపెద్ద దూరమయ్యాక మా జీవితాలు అంధకారంలోకి వెళ్లిపోయాయి. మా పెద్ద కొడుకుగా చంద్రబాబు మా కష్టాలను చూసి ఆదుకున్నారు. రూ.నాలుగు వేలు పింఛను అందించి.. నాలుగేళ్లు నోటికెళ్లేలా చేశారు.

-వాయిలపెల్లి సాయమ్మ, బమ్మిడి శ్యామలమ్మ, మఖరజోల, మందస మండలం

ఆసరా లేక ఇబ్బంది పడ్డాను..


జి.ఢిల్లేశ్వరికి పింఛను అందిస్తున్న గ్రామస్థులు

కవిటి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తి అకస్మాత్తుగా మృతి చెందటంతో ఇద్దరు పిల్లలతో నెట్టుకురావడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన స్పౌజ్ పింఛనుతో కొంత భరోసా లభించింది. నా పిల్లలకు కొంత అండగా పింఛను సొమ్ము నిలుస్తుంది.


పింఛను అందుకుంటున్న జావాన పార్వతమ్మ

కుటుంబ పోషణకు వినియోగిస్తా..

నందిగాం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛనును కుటుంబ పోషణకు వినియోగిస్తా. భర్త చనిపోవడంతో ఉపాధి కోల్పోయిన నాకు కూటమి ప్రభుత్వం పింఛను మంజూరు చేయడం ఎంతో సంతోషం కలిగింది. ఈ పింఛన్ ద్వారా ఉపాధి పొందుతాను. దీనికి గాను చంద్రబాబుకు రుణపడి ఉంటా.


వితంతు పింఛను అందుకుంటున్న దమయంతి

● పెద్ద కొడుకులా ఆదుకున్నారు..

అరసవల్లి, ఆగసు 1(ఆంధ్రజ్యోతి): మాది నిరుపేద కుటుంబం. భర్త రోజూ కట్టెలు కొట్టగా వచ్చిన సంపాదనతోనే ఇల్లు గడిచేది. ఒక కుమారుడు, కుమార్తె. ఇంతలోనే నా భర్త హఠాత్తుగా మరణించాడు. ఆ దుఃఖం తీరక ముందే కుమారుడు కూడా చనిపోయాడు. కుమార్తె పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. మీద పడ్డ వయస్సు. కష్టపడలేని పరిస్థితి. పింఛను రూ.4000 ఉదయాన్నే అందించారు. నా జీవితానికి ఒక ఆసరా, భరోసా కల్పించారు. ఎంతో సంతోషగా ఉంది. ఇంటి పెద్ద కొడుకులా చంద్రబాబు ఆదుకున్నారు. ఆయన కలకాలం చల్లగా ఉండాలి.

వైసీపీ పట్టణ ఉపాధ్యక్షుని తల్లికి వితంతు పింఛను..


మోహినమ్మకు పింఛను అందిస్తున్న టీడీపీ నాయకులు

పలాస, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పట్టణ వైసీపీ ఉపాధ్యక్షుడు నర్తు వెంకటరమణయ్య తల్లి మోహినమ్మకు వితంతు పింఛను మంజూరైంది. శుక్రవారం ఉదయం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆమె ఇంటికి వెళ్లి పింఛను అందించారు. ఈ సందర్భంగా ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు టీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్ విలేకరులతో మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పింఛన్లు అందిస్తున్నామని చెప్పడానికి వితంతు పింఛన్లే ఉదాహరణ అన్నారు. వైసీపీ నాయకులు పింఛన్లపై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు తండ్రి వల్లయ్య మూడు నెలల క్రితం మృతి చెందగా ఆయన భార్య మోహినమ్మకు పింఛను మంజూరు చేసి పారదర్శకత నిరూపించామన్నారు. పింఛను పొందిన మోహినమ్మ మాట్లాడుతూ తనకు గుర్తించి పింఛను అందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలి కృష్ణారావు, యవ్వారి మోహనరావు. కొరికాన శంకర్ పాల్గొన్నారు.

కష్టపడి.. కొలువు పట్టి!

- కానిస్టేబుళ్లుగా ఎంపికైన కుర్రాళ్లు
- అధికశాతం మధ్యతరగతి కుటుంబాలే
- నిరంతర శ్రమతో ఉద్యోగాల సాధన

నిరంతర సాధన... ఎలాగైనా సాధించాలనే తపన... తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి.. వారికి అండగా నిలవాలనే యోచన... భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనే ప్రయత్నం... పోలీసు ఉద్యోగంలో చేరాలనే దీక్ష.. ఇవన్నీ ఆ యువకులను లక్ష్య సాధన వైపు నడిపించాయి. తోటివారికి ఆదర్శంగా నిలిచేలా చేశాయి. తల్లిదండ్రులు...మిత్రులు...గ్రామస్థులు గర్వపడేలా చేశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో అత్యధికం సామాన్య కుటుంబాల వారే ఉండడం గమనార్హం.

సాధారణ కుటుంబాల నుంచి...


హేమంత్ సాహు, ప్రవీణ్‌కుమార్

కంచిలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొక్కిలిపుట్టుగ పంచాయతీ పెద్ద ఆముదాల పుట్టుగ గ్రామానికి చెందిన హేమంత్ సాహు, మఖరాంపురం పంచాయతీ సాలిన పుట్టుగ గ్రామానికి చెందిన సాలిన ప్రవీణ్ కుమార్ కానిస్టేబుల్‌లుగా ఎంపికయ్యారు. ఇద్దరూ సాధారణ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే. హేమంత్ సాహు తల్లిదండ్రులు రోజుకూలీలు కాగా, అక్కకు వివాహమైంది. ప్రవీణ్ కుమార్ తండ్రి గ్రామంలో పాలకేంద్రం నడుపుతున్నారు. తల్లి గృహిణి.


మోహన్‌బాబు నిట్ట నవీన్ వాడ మహేష్

మత్స్యకార గ్రామాల నుంచి...

సోంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో మత్స్యకార యువకులు సత్తాచాటాడు. చేపలగొల్లగండి గ్రామానికి చెందిన నిరుపేద మత్స్యకార కుటుంబానికి చెందిన యువకుడు కోడ మోహన్‌బాబు సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మోహన్‌బాబుకు తల్లిదండ్రులతోపాటు విజేత యువజన సేవా సంఘం సభ్యులు, గ్రామపెద్దలు అభినందించారు. ఆయనతో పాటు రామయ్యపట్నం గ్రామానికి చెందిన నిట్ట నవీన్, వాడ మహేష్, ఇస్కలపాలెం గ్రామానికి చెందిన నిట్ట బైరాగి కూడా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

కవిటి మండలంలో..


దిలీప్ ప్రకాష్

కవిటి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలోని మారుమూల మత్స్యకార గ్రామాలకు చెందిన యువకులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఇద్దివానిపాలెం గ్రామం నుంచి వంక ప్రకాష్, కర్రి దిలీప్, బట్టివానిపాలెం నుంచి లక్ష్మణ్‌లు ఎంపికయ్యారు. వీరి తల్లిదండ్రులు వేట జీవనాధారంగా బతుకు సాగిస్తున్నారు. అలాగే కవిటికి చెందిన జడ్డిడ సునీల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. సునీల్ అన్నయ్య ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. అదే శాఖలో తమ్ముడు కూడా ఉద్యోగం పొందటంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఒకే గ్రామం నుంచి ముగ్గురు...

జి.సిగడాం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెంట గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన మక్క రామకృష్ణ, లావేటి సూరపునాయుడు, కిల్లారి నాగరాజులు పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సూరపునాయుడు తల్లిదండ్రులు లక్ష్మీ, సూర్యనారాయణలు వ్యవసాయ కూలీలు. రామకృష్ణ, తల్లిదండ్రులు వరలక్ష్మీ, మల్లికార్జునరావు, నాగరాజు తల్లిదండ్రులు దమయంతి, రాము పిల్లలను వ్యవసాయం చేసుకుంటూ కాయకష్టంతో చదివించారు. బాతువ గ్రామానికి చెందిన బూటు హరికుమార్ కూడా కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

దుఃఖాన్ని అదిమిపట్టి...


గుడాల చిన్నారావు

ఎచ్చెర్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హోంగార్డుగా పనిచేస్తున్న ధర్మవరం గ్రామానికి చెందిన గుడాల చిన్నారావు కానిస్టేబుల్ (సివిల్)గా ఎంపికయ్యాడు. 2017లో హోంగార్డుగా ఎంపికైన చిన్నారావు, ఆ తర్వాత గీతం యూనివర్సిటీ నుంచి దూరవిద్యలో బీఏ డిగ్రీ పూర్తిచేశాడు. పదోతరగతి పరీక్షల్లో మూడుసార్లు ఫెయిలైనప్పటికీ... నిరాశ, నిస్పృహకు గురికాకుండా స్వయంకృషితో డిగ్రీ పూర్తిచేశాడు. రాత పరీక్షకు 20 రోజుల ముందు చిన్నారావు తండ్రి రాముడు అనారోగ్యంతో మృతిచెందగా.. దుఃఖాన్ని దిగమింగుకుని రాతపరీక్షకు హాజరై విజయం సాధించాడు. ఆయన అన్నయ్య రాజారావు చింతలవలసలోని ఏపీఎస్పీ 5వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.

ఒకే గ్రామం నుంచి ముగ్గురు


రాజశేఖర్ గొర్లె వంశీ ఉపేంద్ర

పొందూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బురిడి కంచరాం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వండాన రాజశేఖర్, గొర్లె వంశీ, వండాన ఉపేంద్రలు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో గ్రామస్థులు అభినందించారు.

కానిస్టేబుల్‌గా ఇంజనీరింగ్ విద్యార్థి...


జమ్ము రఘుకుమార్

నరసన్నపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గొనపపేటకు చెందిన జమ్ము శాంతారావు, లక్ష్మీనారాయణల కుమారుడు జమ్ము రఘుకుమార్‌సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. సివిల్ఇంజనీరింగ్‌పూర్తి చేసిన రఘు పోలీసు శాఖలో చేరాలనే లక్ష్యంతోనే 2019 నుంచి పట్టుదలతో సాధన చేశాడు. గతంలో గ్రామ సచివాలయ వ్యవస్థలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కానీ ఆ ఉద్యోగంలో చేరకుండా పోలీసు కావాలనే లక్ష్యంతోనే చదివినట్లు రఘు తెలిపాడు. రఘును గ్రామస్థులు అభినందించారు.

మత్స్యకార యువతి..


యోగేశ్వరి

సంతబొమ్మాళి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): లింగూడు పంచాయతీ ఎం.సున్నాపల్లికి చెందిన మత్స్యకార యువతి తై.యోగేశ్వరి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. తీరప్రాంత మత్స్యకార కుటుంబంలో జన్మించిన యోగేశ్వరి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదివింది. సివిల్ కానిస్టేబుల్ ఎంపికైన యోగేశ్వరిని గ్రామ స్థులు అభినందించారు.

రణస్థలం మండలంలో...

రణస్థలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వల్లభరావుపేట గ్రామానికి చెందిన వాయిలపల్లి సన్యాసినాయుడు, దేవరాపల్లి గ్రామానికి చెందిన దన్నాన మహేంద్రరావు, వేలుపురాయి గ్రామానికి చెందిన గొర్లె సురేష్‌లు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిని స్థానికులు అభినందించారు.


సన్యాసినాయుడు మహేంద్రరావు గొర్లె నరేష్

వైసీపీ దొంగలను నిలదీయండి

(మూడో పేజీ తరువాయి)

పెంపు, ఉచిత సిలిండర్, తల్లికి వందనం పథకాలు అమలు చేశాం. అన్నక్యాంటీన్లు తెరిచాం. శనివారం అన్నదాత సుఖీభవ పథకం కిందట రైతుల ఖాతాల్లో రూ.7వేలు చొప్పున తొలి విడత నిధులు జమ చేయనున్నాం. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామ'ని తెలిపారు. ఆరు నెలల్లో చిట్టివలస పంచాయతీలో సీసీ రోడ్లు, తాగునీటి తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నాయకులు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, కామేశ్వరరావు, బోయిన రమేష్ పాల్గొన్నారు.

పింఛన్ల విధానంలో ఆదర్శం

(మూడో పేజీ తరువాయి)

తెలిపారు. అలాగే పింఛన్ పొందిన భర్త మరణిస్తే.. ఆ తర్వాత నెల నుంచే భార్య వితంతు పింఛన్ మంజూరు చేస్తామన్నారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'గ్రామస్థుల అభ్యర్థన మేరకు చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తాం. మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. గ్రామ పర్యావరణ పరిశుభ్రతకు ప్రజలు సహకారం అవసరమ'ని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో ఉపాధిహామీ పనులు తాత్కాలికంగా నిలిచినా, రూ. 40లక్షల చొప్పున రెండు రోడ్లకు నిధులు మంజూరు చేశామన్నారు. కాలువ పనులు త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిప్రత్యూష, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యాటకం దిశగా.. పూడిలంక తీరం

(మూడో పేజీ తరువాయి)

మత్స్యకారులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి' అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.నాలుగు కోట్లతో పూడిలంకకు వంతెనతో కూడిన రోడ్డు మార్గాన్ని నిర్మించనుంది. ఈ నేపథ్యంలో పర్యాటకులు పెరిగే అవకాశం ఉంది. దీనికితోడు పక్కనే ఉన్న సముద్రం.. పర్యాటకులను మరింత ఆకట్టుకోనుంది. కలెక్టర్ ఆలోచన కార్యరూపం దాల్చేలా పర్యాటకశాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంతో అనువైనది..



పూడిలంక ప్రాంతం పర్యాటకాభివృద్ధిపై కలెక్టరు మాట్లాడడం ఆనందంగా ఉంది. ఈ ప్రాంతం పర్యాటకాన్ని ఎంతో అనువైనది. ఇక్కడ పర్యాటకంగా అభివృద్ధి చేస్తే.. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-లండవాసు, పల్లివూరు


ఇసుక రవాణాకు పంట పొలాల్లో వేసిన రహదారి

కప్పెయ్.. దోచెయ్

(మూడో పేజీ తరువాయి)

వర్షాకాలంలో ఇసుక రీచ్‌లో తవ్వకాలు జరపకూడదు. వంశధార నదిలో డీసిల్టేషన్ తొలగింపు కోసం ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చామ'ని తెలిపారు. ఇసుక తవ్వకాలకు అనుమతి పత్రంలో ఎక్కడా వంశధార నది ప్రస్తావన లేదని ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లగా, ఆ ఆర్డర్ కాపీ వాట్సాప్‌లో పంపిస్తే చూస్తామనడం గమనార్హం. కాగా ప్రస్తుతం నదిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతంలో ఇప్పటికే అక్రమ ఇసుక క్వారీలతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి లోతట్టుగా మారింది. ఇసుక మేటలు చూద్దామన్నా కనిపించే పరిస్థితి లేదు. ఇప్పటికే భగీరథపురం వైపు అక్రమ ఇసుక తవ్వకాల వలన నదీ గమనం మారి భగీరథపురం, మహాలక్ష్మీపురం, పిండ్రువాడ, అక్కరాపల్లి గ్రామాల్లోని పంట పొలాలు కోతకు గురవుతున్నాయి. కొద్దిపాటి వంశధార వరదకే గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఈనేపథ్యంలో ఇసుక మేటలు ఉన్నాయంటూ డీసిల్టేషన్ పేరుతో తవ్వకాలకు అధికారులు ఎలా అనుమతిచ్చారనే విషయం ప్రశ్నార్థకంగా మారింది.

● ఈ విషయమై మైనింగ్ డీడీ మోహనరావును వివరణ కోరగా 'ఇసుక రీచ్ మంజూరులో నాకు సంబంధం లేదు. ఇరిగేషన్ శాఖ అనుమతులు ఇచ్చింది. స్టాక్‌యార్డుల నుంచి కానీ, డీసిల్టేషన్ జరిపి మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతులు ఉన్నాయి. వర్షాకాలంలో ఎక్కడా ఇసుక రీచ్‌ల నిర్వహణకు అనుమతులు లేవు' అని తెలిపారు.

● గొట్టాబ్యారేజీకి ముప్పు..

గొట్టాబ్యారేజీ దిగువ ప్రాంతంలో మూడు కిలోమీటర్ల దూరంలో జోరుగా ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో.. బ్యారేజీకి ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే బ్యారేజీ దిగువ భాగం పూర్తిగా దెబ్బతింది. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో క్వారీ ఏర్పాటుకు మైనింగ్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. కానీ గొట్టాబ్యారేజీ భద్రత దృష్ట్యా అనువైన ప్రాంతం కాదని ఆ ఆలోచన విరమించారు. ప్రస్తుతం ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనుమతులిచ్చారంటూ ఈ ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా యంత్రాలతో తవ్వకాలు చేస్తుండడంతో ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

హఠాత్తుగా వరద వస్తే..

ప్రస్తుతం వర్షాకాలం వేళ.. ఇసుకలోడ్ చేస్తున్న సమయంలో వంశధార నది హఠాత్తుగా వరద వస్తే యంత్రాలు కొట్టుకుపోతాయి. ప్రాణనష్టం కూడా జరిగే అవకాశం ఉంది. నదిలో వరద ఉధృతి పెరిగితే.. అధికారులు వెంటనే గొట్టాబ్యారేజీ గేట్లు పైకి ఎత్తేస్తారు. ఆ సమయంలో బ్యారేజీకి మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్న ర్యాంపు వద్దకు క్షణాల్లోనే వరద ప్రవాహం చేరి.. ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

అనుమతి ఇవ్వలేదు..

వంశధార పిల్లకాలువను మట్టితో కప్పివేసేందుకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఇసుకు రీచ్ నిర్వాహకులు కాలువపై కల్వర్టు కడతామంటే అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పాం. ఇంతవరకు దరఖాస్తు అందలేదు.

-ధనుంజయ, గొట్టాబ్యారేజీ ఏఈ

దారుణంగా ప్రధాన రహదారి



గోతులతో నిండిన ప్రధాన రహదారి

సరుబుజ్జిలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి ప్రధాన మార్గం గోతులతో నిండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైసీపీ హయాంలో గోతులను పూడ్చేందుకు అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేసినా పనులు జరగలేదు. సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచి ఎల్ఎన్‌పేట మండలం బొర్రంపేట వరకుసుమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో నిత్యం వందలాది భారీ, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్ల దారులు స్థలాలను ఎత్తు చేయడంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచి గోతుల్లో చేరి మరింత దారుణంగా తయారయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

చినుకుపడితే చిత్తడే..!



బురద రోడ్డుపై వాహనదారుని అవస్థలు

గార రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వత్సవలస పంచాయతీ పరిధి అల్లిగుడ్డి గ్రామా నికి వెళ్లే రహదారి ఏమాత్రం వర్షం పడినా దారుణంగా తయారవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా చిత్తడిగా మారి కనీసం నడిచేందుకు కూడా అవ కాశం లేకుండా ఉంది. ద్వి చక్ర వాహనాలు సైతం ఈ బురదలో స్లిప్ అయి వాహ నదారులు పడిపోయిన ఘటనలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. 108 వాహనం వచ్చే పరిస్థితి లేదు. ఈ గ్రామం లో సుమారు 50 కుటుంబాల వారు నివసిస్తున్నారు. ఈ రోడ్డుతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా పాలిటెక్నిక్ గేటు వద్ద ఇలా..

● విద్యార్థినులకు ఇక్కట్లు



మహిళా పాలిటెక్నిక్ వద్ద పరిస్థితి.. ఇబ్బందులుపడుతున్న విద్యార్థినులు

ఎచ్చెర్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కుశాలపురం బైపాస్ రోడ్డుకు సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ప్రధాన గేటుకు ఎదురుగా నీరు నిలిచి పోవడంతో విద్యార్థినులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాల పరిసరాల్లో బయట కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో వర్షపు నీరు రోడ్డుపక్కనే నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం నుంచి ఈ సమస్య తలెత్తడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని కళాశాల ప్రిన్సిపాల్ మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా జిల్లాలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవార్లను దర్శించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



ఇచ్ఛాపురం: సత్యసాయి మందిరంలో సామూహిక వ్రతాలు..



కోటబొమ్మాళి: కొత్తపేట శివకేశవ పంచాయతన దేవస్థానంలో..



శ్రీముఖలింగం: వారాహి అమ్మవారి ఆలయంలో..



గార: దుర్గాదేవి ఆలయంలో..



నందిగాం:పెంటూరు వేంకటేశ్వర ఆలయంలో



ఎల్ఎన్ పేట: గార్లపాడు ఆర్ఆర్ కాలనీలో..



హిరమండలం: సంతోషిమాత ఆలయంలో..



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత ఆలయం వద్ద క్యూలైన్‌లో ఉన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) అమ్మవారి అలంకరణ



పోలాకి: దీర్ఘాశిలో పుష్పాలంకరణలో దుర్గమ్మ



టెక్కలి: సంతోషిమాత ఆలయంలో..



హరిపురం: మఖరజోలలో..

అక్టోబరు 2 నాటికి ప్లాస్టిక్ రహిత నగరం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2వ తేదీ నాటికి ప్లాస్టిక్ రహిత నగరంగా శ్రీకాకుళాన్ని తయారుచేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం డీసీసీబీ కాలనీ, చాపురం ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మార్చామని పేర్కొన్నారు. కాలువలు శుభ్రంగా లేకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ ఇంటికి ర్యాంపులు క్రమపద్ధతిలో లేకపోవడంపై ప్రణాళిక అధికారులను ప్రశ్నించారు. పరిశుభ్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, నగరాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. కమిషనర్ ప్రసాదరావు,శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరివ్వాలి: ఎన్ఈఆర్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా చేయడమే లక్ష్యమని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఈ దుర్యోధనరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అలరించిన శ్రావణ లక్ష్మి పోటీలు



సంప్రదాయ పోటీల్లో పాల్గొన్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్ ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మహిళల శ్రావణ లక్ష్మీ సంప్రదాయ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, ప్రముఖ వైద్యురాలు పైడి సింధూర మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళ అని, తల్లిగా, సోదరిగా, భార్యగా తన పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు ప్రిస్కిల్ల గిరి రాజ్ రాధారాణి ఆధ్వర్యంలో సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు తెలిపేందుకు ఈ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు సంప్రదాయ వస్త్రాలను ధరించి పోటీల్లో పాల్గొన్నారు.

నిబంధనల మేరకే తూనిక యంత్రాల తనిఖీ

పాత శ్రీకాకుళం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చౌక ధరల దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను ప్రతి ఏటా ప్రభుత్వ నిబంధనల మేరకే తనిఖీ చేసి సీలు వేయడం జరుగుతుందని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లీగల్ మెట్రాలజీ సంచాలకుల ఆదేశాల మేరకు తూనిక యంత్రాల మరమ్మతులు, టెస్టింగ్, క్యాలిబ్రేషన్ కోసం రూ.600, ప్రభుత్వ ఫీజు కింద రూ.300 చెల్లిం చాల్సి ఉంటుందని, మొత్తం రూ.900 మాత్రమే డీలర్లు, వ్యాపారులు చెల్లించాలన్నారు. అంతకుమించి ఎటువంటి ఫీజు అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పౌరసరఫరాల శాఖ డీటీ పర్యవేక్షణలోనే కాటాల పరీక్ష, సీలు వేయడం జరుగుతుందన్నారు.

నేరాలను నిరోధించేందుకు చర్యలు

పొందూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నేరస్తులు, నేర స్వభావం కలిగిన వారిని గుర్తించి నేరాలను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. కృష్ణాపురం (గారపేట)లో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని 5 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

'అక్షర ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్షరాస్యత పెంపుదలే లక్ష్యంగా అమలు చేస్తున్న 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో 1,12,071 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించామన్నారు. జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, పీడీలు కిరణ్‌కుమార్, సుధాకరరావు, ఎస్‌వీ రమణ, డీపీవో భారతీ సౌజన్య పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని హమాలీల నిరసన

ఎచ్చెర్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలో ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాట్లింగ్ యూనిట్‌లో పనిచేస్తున్న హమాలీలు శుక్రవారం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. డిపోను విడదీయొద్దని సీఐటీ యూ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఆందోళనలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు మాట్లాడుతూ.. బాట్లింగ్ యూనిట్ ఏర్పాటుకు భూములిచ్చిన దళితులకు అన్యాయం చేయొద్దన్నారు. కార్యక్రమంలో హమా లీల యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎం.సురేష్, నిడిగింట్ల రమణ పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు డా.బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశా లలో 2025-26 సంవత్సరానికి 5 నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతు న్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత, కేటగిరి వారీగా కేటాయించనున్నామన్నారు. అర్హులైన విద్యార్థినులు డాక్యుమెంట్లతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోగా గురుకులంలో హాజరుకావాల

సమన్వయంతో స్వాతంత్ర్య వేడుకలు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి విజయ వంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15న ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే వేడుకలు విశిష్టంగా ఉండాలని, తమ విభాగానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి

జి.సిగడాం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాలఖండ్యాం ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ నువ్వసలు మనిషివేనా?

● కూటమి పాలన చూసి ఓర్వలేకే విమర్శలు

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): 'జగన్.. నువ్వసలు మనిషివేనా? మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని వెనకేసుకొస్తున్నావ' అంటూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై తీవ్రంగా మండిపడ్డారు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. 'ఐదేళ్ల పరిపాలించడం చేతకాక.. ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి నాటి ప్రతిపక్ష పార్టీ నేతలను, సామాన్య ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేయడంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి చెందడం వల్ల ఆ పార్టీ అధినేత జగన్‌కి మతి భ్రమించింది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో రాష్ట్ర ప్రజలకు అందిస్తూ ఉంటుంటే అది చూసి ఓర్వలేకపోతున్నాడు జగన్. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రానికి పెట్టు బడులు వస్తుంటే జీర్ణించుకోలేక ప్రజా ప్రభుత్వంపై జగన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తు న్నాడు. అవినీతిపరులను, దొంగలను, బెట్టింగ్ ఆడేవారిని, సంస్కారం లేని వ్యక్తులను వెనకేసుకొచ్చే జగన్‌కి ముఖ్యమంత్రి చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని విమ ర్శించే అర్హత లేదు. ఒక మహిళా ఎమ్మెల్యేను అసభ్యకరంగా మాట్లాడి.. వ్యక్తి గతంగా దూషించిన ప్రసన్నకుమార్ రెడ్డిని, అవినీతి చేసి జైలులో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు జగన్ రావడం విడ్డూరంగా ఉంది. మరలా అధికారంలోకి వస్తే ఎవరినీ వదలమని వైసీపీ నాయకులు హెచ్చరిస్తు న్నారని.. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని.. వారికి ఓట్లు వేసే పరిస్థితి ఉండకపోగా రోడ్లపై కూడా జగన్ రెడ్డిని, వైసీపీ నాయకులను తిరగనివ్వరు' అని హెచ్చరించారు.

పాఠశాలల్లో క్రీడా వసతుల కల్పనకు కృషి

● ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలల్లో క్రీడా వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో జిల్లాస్థాయి పీఈటీలు, పీడీల రెండు రోజుల వర్క్‌షాప్, సెమినార్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం, కొన్ని ప్రత్యేక కారణాలవల్ల జిల్లాలో క్రీడా వసతుల కల్పనలో జాప్యం జరిగిందన్నారు. కలెక్టర్‌తో చర్చించి జిల్లాలో పాఠశాలల్లో క్రీడల నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చనున్నట్లు హామీ ఇచ్చారు. డిప్యూటీ డీఈవో విజయ కుమారి మాట్లాడుతూ.. సెమినార్, వర్క్‌షాప్ నిర్వహణ వల్ల వృత్తి నైపుణ్యాభివృద్ధితోపాటు వృత్తిపరమైన సమస్యలు పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. టెక్కలి డిప్యూటీ డీఈవో పి.విలియమ్స్ మాట్లాడుతూ.. జిల్లా పాఠ శాలల క్రీడల నిర్వహణలో సమస్యలను తన దృష్టికి తీసు కొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఈటీ, పీడీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, గ్రిగ్స్ కార్యదర్శి కె.మాధవ రావు, విజయ నగరం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వెంకట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మాలి కుల సమస్యకు పరిష్కారం

● 50 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు అందజేత



కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న మాలి కులస్థుల కుల ధ్రువీకరణ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. కుల ధ్రువీకరణ కోసం అనేక పర్యాయాలు కుల సంఘ నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందించి వారికి కుల ధ్రువీకరణ పత్రాలిచ్చేందుకు నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం పాయితారి, కీర్తీపురం, కొళిగాం పంచాయతీల్లో ఉన్న 50 మంది మాలి కులస్థులకు బీసీ-డి కుల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ రామయ్యపుట్టుగలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మాలి కులస్థులకు అండగా ఉంటుం దన్నారు. వీరికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆ కుల సంఘ నేతలు ఎమ్మెల్యేను సత్కరించారు.

కార్య క్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జి, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, బోరిబద్ర లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

బుడతవలస దళితుల భూములకు రక్షణ కల్పించాలి

లావేరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బుడతవలస దళితుల భూములకు రక్షణ కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారావు సింహాచలం, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బుడతవలస గ్రామాన్ని వారు సందర్శించి వివాదాస్పద భూమిని పరిశీలిం చారు. 2006లో అప్పటి ప్రభుత్వం దళితులైన పిన్నింటి లక్ష్మీ, రమణమ్మ, కుప్పిలి అనసూయ, కుప్పిలి సింహాచలంలకు సర్వే నెంబరు 344లో 6-43 సెంట్లు డి పట్టా మంజూరు చేసిందన్నారు. ఆ భూముల్లో నీలగిరి తోటలను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, అయితే ఆ చెట్లను ఇటీవల నడుపూరి రాంబాబు, మహంతి రాజులు, రూప వారి కుటుంబ సభ్యులు నరికేశారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తక్షణం వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధిత రైతులు పిన్నింటి సూర్యనారాయణ, అప్పారావు, కుప్పిలి రమణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వితంతువులకు భరోసా

ఆమదాలవలస, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వితంతు మహిళలకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసి భరోసా కల్పించిందని మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 16 వార్డు డాబాల వారి వీధిలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుడ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకుడు జీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ఇచ్ఛాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. శుక్రవారం లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పత్రి తవిటయ్య యాదవ్, ఎన్.కోటి, కౌన్సిలర్ ఆశి లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతికి సంతాపం

ఆమదాలవలస, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదో వార్డు అక్కివలసకి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త బండి సిమ్మయ్య (72) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెం దారు. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా ప్రత్యేక గుర్తింపు పొందిన సిమ్మయ్య మృతి పట్ల పార్టీ పట్టణ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సంతాపం తెలిపిన వారిలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, నాయకులు మొదలవలస రమేష్, సంపతిరావు మురళీధరరావు, బీవీ రమణమూర్తి తదితరులున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఇచ్ఛాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని పలువురు వక్తలు అన్నారు. ఇచ్ఛాపురం ఐసీడీఎస్ పరిధిలోని రత్తకన్న, పురుషోత్తపురం, జగన్నాథ పురం గ్రామాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. తల్లిపాలఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు.

గారలో ర్యాలీ

గార, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గారలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి స్థానిక మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఐ.విమల, సీడీపీవో శోభారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీవోగా రాజేశ్వరి



ఇచ్ఛాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛా పురం ఐసీడీఎస్ పీవోగా ఎం.రాజేశ్వరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నర్సీపట్నంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

పాత శ్రీకాకుళం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 8 వరకు సంబంధిత ఎంఈవోలకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు నమూనాలు మండల విద్యాశాఖ కార్యాలయాలు, జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు



టెక్కలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ పట్టుమహాదేవి కోనేరు గట్టుపై శుక్రవారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు గుర్తించారు. మృతిచెందిన వ్యక్తి నీలంరంగు టీషర్ట్, ట్రాక్ ఫ్యాంట్ వేసుకొని ఉన్నాడని, మృతుడి వివరాలు తెలిసినవారు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

పురుగుమందు డబ్బాతో మహిళ హల్‌చల్

● న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన



రేణుకకు నచ్చజెప్పుతున్న పోలీసులు

నందిగాం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్ ముందు శుక్రవారం ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంటానంటూ పురుగు మందు డబ్బాతో హల్‌చల్ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. టెక్కలికి చెందిన జోగి రేణుకకు ఆమె భర్తతో గతంలో తగాదా ఉండేది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో వారిద్దరికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో లోక్‌అదాలత్‌లో పోలీసులు రాజీ చేయించారు. తన భర్త అన్నివిధాలుగా తన పిల్లలకు, తనను చూసుకుంటానని పోలీసుల సమక్షంలో హామీ ఇచ్చారని, ఇప్పుడేమో పట్టించుకోవడం లేదు. దీంతో పోలీసులే తనకు న్యాయం చేయాలని, లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని పోలీస్ స్టేషన్ ముందు పుగురమందు డబ్బాతో బైఠాయించి నిరసన తెలిపింది. దీంతో అప్రమత్తమైన అక్కడున్న పోలీసులు ఆమెకు నచ్చజెప్పి చేతిలో ఉన్న పురుగు మందు డబ్బాను తీసుకున్నారు. అనంతరం రేణుకతో ఎస్ఐ రాము మాట్లాడి, నచ్చజెప్పి ఇంటికి పంపించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో నాగుపాము కలకలం



నరసన్నపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బొడ్డవానిపేట అంగన్‌వాడీ కేంద్రంలో నాగుపాము శుక్రవారం కలకలం సృష్టించింది. ఉదయం 9 గంటలు ప్రాంతంలో అంగన్‌వాడీ కార్యకర్త కేంద్రం తలుపుతెరిచి.. పిల్లలకు పౌష్టిహారం తయారు చేసేందుకు ఒక బాక్స్‌లో ఉన్న గరిటెలు తీసే క్రమంలో అందులో నుంచి బుసలు కొడుతూ నాగపాము బయటకు వచ్చి పడగవిప్పింది. వెంటనే అప్రమత్తమైన కార్యకర్త వనజాక్షి కేంద్రానికి వచ్చిన పిల్లలను బయటకు తీసుకువెళ్లి.. గ్రామస్థులకు సమాచారం ఇచ్చింది. దీంతో గ్రామస్థులు కొందరు వచ్చి ఆ బాక్స్‌లో ఉన్న నాగపామును పట్టుకొని సమీప పొలాల్లో విడిచిపెట్టారు. సకాలంలో గుర్తించడంతో ప్రమాదం తప్పిందని, కేంద్రం పరిసరాల్లో బోరుబావి, పచ్చిక ఉండడంతో తరచూ పాములు సంచరిస్తున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు.

ప్రాంగణ నియామకాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక



నియామక పత్రాలిస్తున్న క్యాంపస్ డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ క్యాంపస్‌లో జరిగిన ప్రాంగణం నియామకాల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గ్రిడ్లెక్స్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) సంస్థ నిర్వహించిన ఈ ఎంపికల్లో సీఎస్ఈ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ మునిరామకృష్ణ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ జి.రవి తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్

పలాస, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని పలాస డివిజన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి చాపర వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఓ కల్యాణ మండపంలో మీటర్ రీడర్ల సమావేశం జరిగింది. వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో 4,500 మందికి పైగా రీడర్లు పనిచేస్తున్నారని, 20 ఏళ్లుగా సంస్థను నమ్ముకొని పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కుదించిన పనిదినాలు పెంచాలని, కాంట్రాక్టర్ల వత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మీటర్‌రీడర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైపల్లి ఓంకార్, ప్రధాన కార్యదర్శిగా దూగాన భాస్కరరావు, పలాస డివిజన్ అధ్యక్షుడిగా జీరు ప్రేమ్‌భూషణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంఖుచంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కవిటి: రామయ్యపుట్టుగలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్



పలాస రూరల్: నీలావతి గ్రామంలో పింఛన్ డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



పాతపట్నం: పెద్దలోగిడిలో పింఛన్ డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పండగలా పింఛన్ల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు.

\- ఆంధ్రజ్యోతి బృందం



కొత్తూరు: మాతలలో పింఛన్ పంపిణీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ



ఎచ్చెర్ల/జి.సిగడాం/రణస్థలం: కుశాలపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్



పోలాకి: మబగాంలో పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



హిరమండలం: గొట్ట గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందిస్తున్న జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు

సకాలంలో ఫిర్యాదులు పరిష్కరిస్తా: ఎస్పీ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సకాలంలో ఫిర్యాదులు పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీ స్టేషన్ ఆవరణలో ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి సోమవారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో, శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ప్రజాఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇక్కడ వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు.

కొఠారింగి-తాళభద్ర రోడ్డు పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న ఐటీడీఏ డీఈ కృష్ణమూర్తి

పలాస రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కొఠారింగి-తాళభద్ర గ్రామ రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో గ్రామానికి చెందిన గర్భవతి సవర శ్యామల అష్టకష్టాలు పడుతూ పలాసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చేరిన ఘటన గురువారం చోటు చేసుకుంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రసవ కష్టాలు శీర్షికతో శుక్రవారం ప్రచురితం కథనానికి అధికారులు స్పందించారు. సీతంపేట ఐటీడీఏ డీఈ కృష్ణమూర్తి శుక్రవారం గ్రామానికి చేరుకొని రహదారిని, గ్రామంలో గల సౌకర్యాలపై గ్రామస్థులతో మాట్లాడారు. ఈ నెల మూడో వారంలో రోడ్డు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రతీసారి ఈ విధంగానే అధికారులు చెబుతున్నారని, తమ దుస్థితిని పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్థులు సవర చంటి, మహిళలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పనులు త్వరలో ప్రారంభించి ఇబ్బందులను తొలగిస్తానిమి ఆయన హామీ ఇచ్చారు.

'తల్లికి వందనం' డబ్బులు ఇప్పించండి

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నువ్వలరేవు గ్రామానికి చెందిన 31 విద్యార్థులు కాశీనగర్ పాఠశాలలో చదువుతున్నారని, వీరికి తల్లికి వందనం డబ్బులు జమకాలేదని ఆ గ్రామానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను ప్రశ్నిస్తే సాంకేతిక కారణాలుగా చెబుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించి తల్లికివందనం సొమ్మును తమ బ్యాంకు ఖాతాలలో జమయ్యేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే శిరీష అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నువ్వలరేవు మాజీ కో ఆప్షన్ సభ్యులు కదంబాల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

టెక్కలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయశాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ టెక్కలి, నందిగాం, పాతపట్నం మండలాల వ్యవసాయశాఖ సి బ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరుగుతుందని, పర్యావరణ కాలుష్యం ఉండదని తెలిపారు.

పీ-4 కార్యక్రమం పేదలకు వరం

టెక్కలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమం పేదలకు వరమని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. శుక్రవారం టెక్కలి మేజర్ పంచాయతీలో జరిగిన పీ-4 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దీని ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పాతపట్నం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మధ్యకు వస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిపాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరప్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమినేతలు గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఎన్జీవో కార్యాలయ నిర్మాణం పూర్తిచేయాలి

పలాస/రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్ రోడ్డులో అసంపూర్తిగా ఉన్న ఏపీఎన్జీవో కార్యాలయ నిర్మాణం పూర్తి చేయడానికి సహకారం అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఆ సంఘ అధ్యక్షుడు బోనెల గోపాల్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్జీఓ హోమ్‌ను నిర్మిస్తే ఎంతో మంది ఉద్యోగులకు వినియోగంగా ఉంటుందన్నారు. అదేవిధంగా శ్రీనివాసనగర్‌లో నివాసాల వద్ద మురుగునీరు నిల్వ ఉండిపోతుందని, పక్కా కాలువ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు కోరారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం అందించారు. వారి వెంట రమణమూర్తి, ఈశ్వరరావు, హరినాథ్, పాఠక్ పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటండి



మొక్కలు నాటుతున్న వెంకన్నచౌదిరి, వాకర్స్‌క్లబ్ సభ్యులు

పలాస, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణానికి ఇబ్బందులు లేకుండా సహకారం అందించాలని గ్లో సంస్థ కార్యదర్శి, పలాస టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదిరి కోరారు. శుక్రవారం వాకర్స్‌క్లబ్ సభ్యులతో కలసి స్థానిక ముత్యాలమ్మ కోనేరు- నెహ్రూపార్కులో మొక్కలునాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక వాకర్ ఇక్కడ ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా కోరారు. గ్లో సంస్థ ద్వారా భారీ ఎత్తున మొక్కలునాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నామని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ దడియాల నర్సింహులు, రాజేంద్ర, సప్ప నవీన్, జోగ మల్లి పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు లోపిస్తే చర్యలు

హరిపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు లోపిస్తే చర్యలు తప్పవని మందస ఎంఈవో-2 సుందర్‌సాల్మన్ అన్నారు. మందస మండలం జీఆర్‌పురంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు వార్డెన్ రామక్రిష్ణ, సిబ్బంది లోకేష్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలు సమర్థంగా నిర్వహించండి

నరసన్నపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 3న జిల్లాస్థాయి యోగా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నిర్వహక కమిటీని సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో జిల్లా స్థాయి యోగా పోటీలకు బ్రోచర్, టీషర్టులను ఆవిష్కరించారు. యోగా పోటీలు విజయవంతం చేయాలని తన సహకారం శతశాతం ఉంటుందని తెలిపారు. నిర్వహక కమిటీ అధ్యక్షుడు కింజరాపు రామారావు, సభ్యులు కేదారీనాథ్, సదాశివుని రవి, మల్లిబాబు, ప్రహర్ష, వండాన సుప్రజ, కుప్పిలి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోవాలో జిల్లా మత్స్యకారుడి మృతి

● చేపలవేట చేస్తుండగా పడవ బోల్తా..



రాజులు (ఫైల్)

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హుంకుంపేట గ్రామానికి చెందిన కారి రాజులు (44) గోవాలో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా చేపల వేట సరిగ్గా సాగకపోవడంతో రాజులు గ్రామస్థులతో కలిసి గోవాకు వలస వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం చేపలవేట కోసం మర పడవ సముద్రంలోకి వెళ్లగా.. అలల తాకిడికి అది బోల్తా పడింది. దీంతో పడవ కింద ఉండిపోయిన రాజులు చెందాడు. ఈ విషయాన్ని శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. రాజులు తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోగా భార్య నాగమ్మ, ఇద్దరు కుమార్తెలు హుంకంపేటలో ఉన్నారు. పొట్టకూటికోసం వెళ్లిన రాజులు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది, కాగా ఏటా 30 మందివరకు గ్రామం నుంచి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటారని గ్రామస్థులు చెబుతున్నారు.

గురుకులంలో ప్రవేశానికి అవకాశం

పాతపట్నం ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న మిగులు సీట్ల భర్తీ ప్రవేశానికి అవకాశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5, 6, 7, 10వ తరగతుల తోపాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్సీ కేటగిరిలో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 5వ తరగతిలో-34, 6వ తరగతిలో-13, 7వ తరగతిలో-18, 10వ తరగతిలో-4, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బైపీసీలో-1 ఎంపీసీలో-12 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైనవారు నేరుగా సంప్రదించాలని తెలిపారు. ఇతర వివరాలకు 8374523273, 9573705525 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ఐసీడీఎస్ పీవోగా విద్య బాధ్యతలు



బాధ్యతలు చేపట్టిన విద్య

టెక్కలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): టెక్కలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిగా ఎస్.విద్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె విజయనగరం జిల్లాలో గ్రేడ్-1 సూపర్వైజర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా టెక్కలి ఐసీడీఎస్ కార్యాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పీవోగా బాధ్యతలు చేపట్టిన విద్య టెక్కలి, నందిగాం మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాల్సి ఉంది.

మందస సీడీపీవోగా అరుణ ..

మందస, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మందస ఐసీడీఎస్ సీడీపీవోగా పి.అరుణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె మన్యం జిల్లా కొమరాడ నుంచి పదోన్నతిపై మందసలో చేరారు. ఇక్కడ పని చేసిన వసుంధరా దేవి రెండు నెలల కిందట సోంపేట మండలానికి బదిలీపై వెళ్లారు.

కొత్తూరు సీడీపీవోగా ఉమ ..

కొత్తూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా అధికారిణిగా కె.ఉమా జానికి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె విశాఖ జిల్లా భీమునిపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు గ్రేడ్-1 సూపర్వైజర్‌గా పనిచేస్తూ సీడీపీవోగా పదొన్నోతిపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన యు.విమలకుమారి నెల రోజుల కిందట మన్యం జిల్లా కుంచంపుట్టి బదిలీ అయింది. ఇన్‌చార్జిగా హిరమండలం సెక్టార్ సూపర్‌వైజర్ పప్పల లక్ష్మీబాయి వ్యవహరించారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా నాయుడు

పోలాకి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పోలాకి మండల టీడీపీ అధ్యక్షుడిగా మిరియబిల్లి వెంకట అప్పలనాయుడుని రెండోసారి కార్యకర్తలంతా ఏకగ్రీవంగా ఎంపికచేశారు. శుక్రవారం మబగాంలో నిర్వహించిన కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఈ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు బైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, సూరపు నారాయణదాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ విస్తృతస్థాయి సమావేశం

నరసన్నపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్ జంక్షన్ వద్ద గల ఒక హోటల్‌లో శనివారం మధ్యహ్నం 3 గంటలకు బీజేపీ నియోకవర్గ విస్తృత్త స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిలా ప్రధాన కార్యదర్శి చింతు పాపారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు, పూర్వ జిల్లా పదాధికారులు, నూతన జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు పాల్గొనాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి విజయనందరెడ్డి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొనున్నట్టు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఆమదాలవలస, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా దర్బార్ ప్రధాన ఉద్దేశమని టీడీపీ జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్ తెలిపారు. శుక్రవారం పట్టణ టీడీపీ కార్యాల యంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సంపతిరావు మురళి, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు నాగళ్ల మురళీధర్, బీపీ రమణ మూర్తి, గరుగుబెల్లి నాగేశ్వరరావు, రీసు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

పోలాకి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పోలాకి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బైరి జయరాం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు స్థానిక వికాస్ గ్రామీణ బ్యాంక్ ద్వారా పీఎం జీవనజ్యోతి యోజనా పథకంలో రూ2లక్షల ఇన్సూరెన్స్ మంజూరైంది. ఈ మొత్తాన్ని శుక్రవారం జయరాం భార్య ఈశ్వరమ్మకు బ్యాంక్ మేనేజర్ ఎం.కోటేశ్వరరావు సర్పంచ్ మజ్జి లక్ష్మీరమణమ్మ, టీడీపీ అధ్యక్షుడు మిరియబిల్లి వెంకట అప్పలనాయుడు చేతుల మీదుగా చెక్కును అందచేశారు. కార్యక్రమంలో వెలుగు సీఎఫ్ వమరవల్లి దుర్గాభవాని, సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న అధికారులు

టెక్కలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): యూరియా, డీఏపీ వంటి ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పర్యవేక్షణ లేక నియంత్రణకు నోచుకోక' కథనంతో వ్యవసాయశాఖ అధికారులు స్పందించి పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎంఆర్‌పీకి మించి అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరలు పట్టీ, స్టాక్ వివరాలు నోటీసు బోర్డుపై పెట్టాలని సూచిం చారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ సత్యం, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ హనుమంతురావు, వ్యవసాయ అధికారి సంధ్య అన్నారు. శుక్రవారం హిరమండలంలోని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్న దుకాణాలను తనిఖీ చేశారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలన్నారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ బి.పాపారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఐదు ఎరువుల షాపులను ఆయన తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. తనిఖీల్లో మండల వ్యవసాధికారి దానకర్ణుడు పాల్గొన్నారు.

ఎల్ఎన్ పేటలో..

ఎల్ఎన్ పేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎరువులను ప్రభుత్వ ధరలకే విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయధికారి కె.సింహాచలం, డిప్యూటీ తహసీల్దార్ నీలిమ తెలిపారు. ఎల్ఎన్ పేట జంక్షన్, తురకపేట జంక్షన్లలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆర్ఐ ఎస్.గవరయ్య, వీఆర్‌వో ఎల్.తిరుమలరావులు పాల్గొన్నారు.



హిరమండలం: రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



మెళియాపుట్టి: తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ పాపారావు




ఎల్ఎన్ పేట: తురకపేట జంక్షన్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

లోవోల్టేజ్‌తో సమస్యలు

టెక్కలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ ఆదీఆంధ్రావీదిలో శుక్రవారం లోవోల్టేజ్ సమస్యతో ఆ వీధి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతంలో ఉన్న 60కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో నెలకొన్న సమస్యలు మూలంగా ఉదయం నుంచి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. విద్యుత్ అంతరాయం మూలంగా వీధిలో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఓవైపు ఎండవేడికి తట్టుకోలేక వృద్ధులు, పిల్లలు ఇళ్లల్లో ఇబ్బందులు పడుతూ కనిపించారు. లోవోల్టేజ్ సమస్య పరిష్కరించాలని ఆ వీధివాసులు కోరుతున్నారు.

అబ్బుర పరుస్తున్న తెల్ల వంకాయలు



గార, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సాధారణంగా వంకాయలు ఆకుపచ్చరంగు, నీలం రంగులో ఉంటాయి. కాని జల్లువలస గ్రామంలో పుల్లటి శశిభూషణరావు పెరటిలో తెల్ల వంకాయలు కాస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఈ విత్తనాలను తెప్పించడం జరిగిందని ఆయన తెలిపారు. వీటిని స్థానికులు ఆసక్తిగా చూస్తున్నారు.